

## తేమ, తాలు పేరిట దోపిడీ

తేమ, తాలు పేరిట దోపిడీ చేస్తున్న మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం రైతులు ఆందోళనకు దిగారు.

వివరాలు 8లో ▸



## హైనా దాడిలో 65 గొర్రెలు మృతి

హైనా దాడిలో 65 గొర్రెలు మృతి చెందగా.. 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో చోటుచేసుకుంది.

వివరాలు 8లో ▸



## సాగుకు సమాయత్తం

రైతులు వానాకాలం సాగుకు సమాయత్తమయ్యారు. పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచింది.

వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### భద్రాద్రి రామయ్య సన్నిధిలో రఘునందన్‌రావు



రామయ్య ఆలయంలో రఘునందన్‌రావు, బీజేపీ నాయకులు

దుబ్బాక: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు గురువారం భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి' తో ఫోన్‌లో మాట్లాడారు. దేశంలో మరోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సీతారామచంద్రస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పార్టీ నాయకులు రఘునందన్‌రావును ఘనంగా సత్కరించారు.

### నేడు విత్తనమేళా..

సిద్దిపేటరూరల్: వ్యవసాయ పరిశోధన కేంద్రం తోర్నాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం హెడ్ డాక్టర్ శ్రీదేవి గురువారం తెలిపారు. వరిలో దొడ్డు రకాలైన జేజీఎల్ -24423 (జగిత్యాల వరి -1), సన్నరకం వరి కేఎస్ఎం -118 (కూనారం సన్నాలు) ఫౌండేషన్ విత్తనాలు, 25 కేజీల సంచికి రూ.1100 చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. కేఎస్ఎం -1638, డబ్ల్యూజీఎల్-44 , డబ్ల్యూజీఎల్ -962 విత్తనాలు 20 కిలోలకు రూ.960 చొప్పున లభించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, నాణ్యమైన విత్తనాలు పొందాలని సూచించారు.

### ఎడ్‌సెట్ పరీక్షకు 89 మంది హాజరు



అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సీబీటీ విధానంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన తొలి సెషన్‌కు 50 మందికి గాను 41 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన సెషన్‌కు 50 మందికి గాను 48 మంది హాజరయ్యారు. రెండు సెషన్లకు కలిపి 11 మంది గైర్హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ రాజశేఖర్ రెడ్డి, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో బొడ్డు రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా, డీపీ రావు, నర్సింహులు పర్యవేక్షించారు.


### ఘనంగా బండ్ల ఊరేగింపు



ఎర్రవల్లి నుంచి బండ్ల ఊరేగింపుగా వెళ్తున గ్రామస్తులు

మర్కూక్(గజ్వేల్): రెండో కంచిగా పేరుగాంచిన వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం మనుమాన్ దేవాలయం చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్లతో వచ్చి పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు, మండల కో ఆప్షన్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

### కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దుబ్బాక: దుబ్బరాజేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం మధ్యాహ్నం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అంతకు ముందు స్వామి వారికి ఎదుర్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, తదితర విశిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవానికి ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు సైతం హాజరయ్యారు.

## విష ప్రయోగమా? భానుడి ప్రతాపమా?

**మిరుదొడ్డి పెద్ద చెరువులో చేపలు మృత్యువాత**

మిరుదొడ్డి పెద్ద చెరువులో అనూహ్య రీతిలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. వేల సంఖ్యలో మృతిచెందుతుండటంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు నీరు వేడెక్కి చేపలు మృత్యువాత పడుతున్నాయా? లేక ఎవరైనా చెరువులో విష ప్రయోగం చేశారా? అన్న విషయమై మత్స్యకారులు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత మత్స్య శాఖ అధికారులు వెంటనే స్పందించి చేపల మృతికి గల కారణాలు తెలుసుకుని తగిన చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. మరో వైపు కుళ్లిపోతున్న చేపలతో చెరువు అంతా దుర్గంధం నెలకొంది. – మిరుదొడ్డి(దుబ్బాక)



పెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు

## యూనిఫాం అందేనా?

**పూర్తిస్థాయిలో రాని వస్త్రం**
- 82వేల మంది విద్యార్థులు
- 1.80లక్షల మీటర్ల క్లాత్ అవసరం
- జిల్లాకు చేరిన క్లాత్ 1.60లక్షల మీటర్లే

పక్షం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ ఏకరూప దుస్తులు ధరించడం వల్ల మరింత క్రమశిక్షణ పెరుగుతుందన్నది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రతీ ఏటా స్కూల్ విద్యార్థులకు ఏక రూప దుస్తులు ప్రభుత్వం అందజేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే దుస్తులు పాఠశాలలకు చేరాలి. ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించాలి. కానీ ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో వస్త్రం రాలేదు. దీంతో పాఠశాల ప్రారంభం రోజు అందడం కష్టంగానే కనిపిస్తోంది. – సాక్షి, సిద్దిపేట



యూనిఫాం మోడల్

జిల్లాలో 941 ప్రభుత్వ పాఠశాలలో 82,157 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో బాలురు 39,170, బాలికలు 42,947 మంది ఉన్నారు. 1 నుంచి 3వ తరగతి వరకు బాలికలకు ఫ్రాక్, 4, 5వ తరగతుల వారికి స్కర్ట్ ఇవ్వనున్నారు. బాలురకు షర్టుకు రెండు జేబులు, మధ్యలో క్లాత్‌తో పట్టి, భుజాలపై క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో కుట్టిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్, పైన కోట్‌తో అందించనున్నారు. బాలురకు షర్టుకు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు, ప్యాంటును ఇవ్వనున్నారు. ఈ సారి దుస్తులు కుట్టించే బాధ్యతలను డీఆర్‌డీఏ, మెప్మాలకు అప్పగించారు. జిల్లా మొత్తంగా 269 కుట్టు కేంద్రాలను ఎంపిక చేశారు.

-పూర్తి స్థాయిలో అందని వస్త్రం

విద్యార్థులకు యూనిఫాంల కోసం 1,80,557 మీటర్ల క్లాత్ అవసరం. ఇప్పటి వరకు జిల్లాకు 1,60,009 మీటర్ల క్లాత్ వచ్చింది. ఇంకా బాలురకు సంబంధించిన క్లాత్ 12,896 మీటర్లు, బాలికలకు డ్రెస్ పై కోట్‌కు 7,652 మీటర్ల క్లాత్ రావాల్సి ఉంది. జిల్లాకు వచ్చిన క్లాత్‌ను సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఈ నెల 21 నుంచి ఆయా కుట్టు కేంద్రాలకు విద్యా శాఖ అధికారులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 16 మండలాలకు క్లాత్‌లకు అందించారు. ఇంకా పది మండలాలకు అందించాలి.

– కొత్త విద్యాసంవత్సరం వేళ పాత దుస్తులేనా?

విద్యార్థులందరికీ యూనిఫాంలు కుట్టి ఇవ్వాలంటే కనీసం 40 రోజులు పడుతుంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో క్లాత్ రాలేదు. దీంతో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం రోజున పాత దుస్తులతోనే హాజరు కావాల్సి ఉండే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి త్వరగా వస్త్రం వచ్చే విధంగా కృషిచేయాలి. పాఠశాల ప్రారంభం రోజే యూనిఫాం ఇవ్వాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

### దుస్తులు సకాలంలో కుట్టాలి

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థుల యూనిఫాంల తయారీని వేగిరం చేయాలని, సకాలంలో అందజేయాలని డీఆర్‌డీఓ జయదేవ్ కుట్టు కేంద్రాలకు సూచించారు. బెజ్జంకిలో యూనిఫాంలు కుట్టే కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2,186 మంది విద్యార్థులున్నారని అన్నారు. వీరికి అవసరమయ్యే 4,372 యూనిఫాంల తయారీకి 8 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కుట్టు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అంజయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీ సారయ్య పాల్గొన్నారు.



బెజ్జంకిలో యూనిఫాం కుట్టు కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

### ప్రారంభం రోజునే అందిస్తాం



కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు కృషి చేస్తున్నాం. క్లాత్ పంపిణీ జరుగుతోంది. డీఆర్‌డీఏ, మెప్మాల ఆధ్వర్యంలో దుస్తులు కుట్టిస్తున్నాం. 269 కుట్టు కేంద్రాలకు అప్పగించాం.

– రంగనాథ్, సెక్టోరియల్ అధికారి

## 'కౌంటింగ్'కు పకడ్బందీ చర్యలు




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- కౌంటింగ్ అధికారులకు శిక్షణ

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు మొదటి విడతగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. కౌంటింగ్ అధికారులకు జిల్లా మాస్టర్ ట్రైనర్ అధికారి అయోధ్యరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియపై క్లుప్తంగా వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు సంబంధించి నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాలలో, హుస్నాబాద్ నియోజకవర్గంకు సంబంధించి కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు 79 మంది, అసిస్టెంట్లు 80 మందిని నియమించినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ సెంటర్లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా ఏఆర్‌ఓను సంప్రదించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, జిల్లా ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ (డిపిఓ) దేవకీదేవి, జిల్లా మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కోకు బల్దియా షాక్

- పట్టణంలో మొక్కల నరికివేతపై ఆగ్రహం
- రూ.24 లక్షల జరిమానా చెల్లించాలని నోటీసు

సిద్దిపేటజోన్: సమాచారం లేకుండా హరితహారం చెట్లను నరికివేయడంపై బల్దియా సీరియస్‌గా తీసుకుంది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 400 చెట్లను నరికివేశారని ఇందుకు గాను రూ.24లక్షల జరిమానా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈకి గురువారం నోటీసు జారీ చేశారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో, ఆయా వార్డుల్లో ఈనెల 19, 22 తేదీల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో హరితహారం కింద నాటిన చెట్లను నరికివేశారని నోటీసులో పేర్కొన్నారు. విద్యుత్ వైర్ల కింద కొమ్మలున్నాయని చెట్లను నరకడం, పైగా మున్సిపల్ అనుమతి లేకుండా చర్యలు చేపట్టారని షోకాజ్ నోటీస్‌లో కమిషనర్ ఆరోపించారు. మరోవైపు మున్సిపల్ శాఖ ఇచ్చిన నోటీసు గురించి విద్యుత్ శాఖ ఎస్ఈ మోహన్ రెడ్డి స్పందించారు. విద్యుత్ చట్టం ప్రకారం వైర్ల కింద ఐదు అడుగుల చెట్లు ఉండరాదన్నారు. వర్షాకాల నేపథ్యంలో చెట్లను తొలగించాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ శాఖ రూ. 24లక్షలు జరిమానా చెల్లించాలని మెయిల్ ద్వారా నోటీస్ ఇచ్చిన విషయం వాస్తవమేనని ధ్రువీకరించారు.



విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నరికిన హరితహారం చెట్లు (ఫైల్)

### చిన్నారెడ్డిని కలిసిన కాంగ్రెస్ బహిష్కృత నేత

మిరుదొడ్డి (దుబ్బాక): పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డిని అక్బర్‌పేట భూంపల్లి మండల కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు అశోక్ గురువారం నగరంలో కలిశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మండలంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని అన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసినట్లు చిన్నారెడ్డికి వివరించారు. కావాలనే కొంత మంది నాయకులు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. మండల ఉపాధ్యక్షుడి పదవినుంచే కాకుండా పార్టీ నుంచి పూర్తిగా తొలగించారని చెప్పారు. ఈ విషయంపై చిన్నరెడ్డి స్పందిస్తూ.. సమస్య తన దృష్టికి రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ కోసం కృషి చేయాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారని తెలిపారు.



చిన్నారెడ్డితో అశోక్

## ఐకేపీ సీసీ సస్పెన్షన్

వట్‌పల్లి(అందోల్): వరి ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించిన ఐకేపీ సీసీ పి.శివశంకర్‌ను కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు డీఆర్‌డీఓ జ్యోతి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి గురువారం తెలిపారు. గత వానాకాల సీజన్‌లో అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం సేకరణకు సంబంధించి కొందరి రైతులకు ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. ఈ విషయమై అప్పట్లో సాక్షి పత్రికలో కథనం ప్రచురించగా.. స్పందించిన అధికారులు పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వకుండా తలాకొంత ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ విషయాన్ని ఈనెల 21న మంగళవారం కన్‌సాన్‌పల్లిలోని వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ ఐకేపీ సీసీని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ విషయమై జోగిపేట ఏపీఎం మాణిక్యంను వివరణ కోరగా తనకు సమగ్ర సమాచారం తెలియదని అన్నారు.

## వేణుగోపాలుడికి కలశాభిషేకం



ఆలయంలో మూలవిరాట్టులకు కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

వర్గల్(గజ్వేల్): బ్రహ్మోత్సవ శోభతో వర్గల్ వేణుగోపాలుని ఆలయం అలరారుతున్నది. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం నేత్రపర్వం చేసింది. ఆలయ మండపంలో 108 కలశాలకు స్థాపనచేసి అర్చకులు కలశ పూజ నిర్వహించారు. గర్భగుడిలో ఏకపీఠంపై కొలువైన రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామివారల మూల విరాట్టులకు అభిషేకం చేశారు. అనంతరం దేవతామూర్తులను పట్టువస్త్రాలు, సర్వాభరణాలు, పూలమాలికల తో కమనీయంగా అలంకరించారు.

**వైభవంగా కల్యాణం**

బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి శ్రీవేణుగోపాలుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, సంపత్‌కుమారాచార్యులు శ్రీస్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామివారల ఎదుర్కోలు, యజ్ఞోపవిత ధారణ, సుముహర్త వేళ జీలకర బెల్లం, మంగళసూత్ర ధారణ, నవదంపతులకు ఒడిబియ్యం తదితర కార్యక్రమాలు నేత్రపర్వంగా కొనసాగాయి. అంగరంగ వైభవంగా సాగిన కల్యాణోత్సవంలో పుర ప్రముఖులు, భక్తజనులు పాల్గొని తరించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుని ఆశీస్సులు పొందారు.



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

## ఎరువులు, విత్తన విక్రయాలపై నిఘా

- ఓఎల్ఎంఎస్ విధానంతో పకడ్బందీ చర్యలు
- లైసెన్సుల రెన్యువల్ కూడా వీటి ద్వారానే

గజ్వేల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో అక్రమాలను నివారించేందుకు ప్రభుత్వం కొత్తగా ఓఎల్ఎంఎస్ (ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) తీసుకొచ్చింది. వ్యాపారులు లైసెన్స్‌లు పొందడానికి, రెన్యువల్‌తోపాటు విక్రయాలకు అధికారుల అనుమతి అంతా ఈ విధానం ద్వారానే జరగనుంది. నకిలీ, అనధికారిక అమ్మకాలకు చెక్ పెట్టేందుకే దీనిని అమలు చేస్తున్నారు. గతేడాది ఎరువులను కొత్త విధానంలోనే విక్రయిస్తుండగా.. తాజాగా విత్తనాలు, పురుగుమందుల విక్రయాలకు సైతం ఈ విధానాన్ని వర్తింపజేశారు.

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 5.50లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయి. వానాకాలంలో రైతులు రసాయనిక ఎరువులపైనే ఆధారపడుతుంటారు. దీంతో యూరియా 63,811మెట్రిక్ టన్నులు, డీఏపీ 25,524 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 20,419మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 49,474మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువుల స్టాకు అవసరం ఉంటుందని అంచనా. అదేవిధంగా విత్తనాల విషయానికొస్తే.. 3.50లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం జిల్లాకు వివిధ రకాల వరి విత్తనాలు 70వేల క్వింటాళ్లకుపైగా అవసరమవుతాయి. కంది ఈసారి 50,880ఎకరాల్లో సాగులోకి వస్తుందని అంచనా ఉండగా.. 3,053 క్వింటాళ్లకుపైగా విత్తనాలు అవసరమవుతాయి. సోయాబీన్ 120ఎకరాల్లో సాగులోకి వస్తుందనే అంచనా.. ఇందుకు 30 క్వింటాళ్ల విత్తనం అవసరముంది. పత్తి 1.5లక్షల ఎకరాలకుపైగా సాగులోకి రానుండగా.. బీటీ-2 విత్తన ప్యాకెట్లు(475 గ్రాముల ప్యాకెట్) సీజన్‌లో 4.5లక్షల ప్యాకెట్ల వరకు అవసరమవుతాయి. ఈరకంగా రూ.కోట్లల్లో ఈ వ్యాపారం సాగనుంది. చాలా మంది వ్యాపారులు జీఎస్టీ సాకుతో రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం పరిపాటిగా మారుతోంది. రైతులు పంట నష్టానికి గురయ్యే సందర్భాల్లో బిల్లులు లేక పరిహారం అందడం లేదు.




గజ్వేల్‌లో ఎరువులు, విత్తన విక్రయాలపై అధికారుల తనిఖీ (ఫైల్)

**లైసెన్స్ సరళతరం**

మరోవైపు వ్యాపారులకు లైసెన్సులు ఇచ్చే విధానం సులువుగా లేకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ఆన్‌లైన్ విధానం ద్వారా దీనిని సరళతరం చేశారు. ఓఎల్ఎంఎస్ వెబ్‌సైట్‌లో దుకాణం, యాజమాని పేరు, లైసెన్స్ నంబర్, ఇల్లు, ఫోన్ నంబర్, జీఎస్టీ తదితర వివరాలు నమోదవుతాయి. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో చూసి అధికారులు ఆమోదిస్తారు. అభ్యంతరాలుంటే అమ్మకాలను నిలిపేస్తారు. ప్రతి వ్యాపారస్తుడికి ఒక లాగిన్ ఐడీ నంబర్ ఇస్తారు. వ్యాపారులు ఏ సంస్థ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయిస్తారో అనే వివరాలతో సోర్స్, ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు నమోదు చేయాలి. ఓఎల్ఎంఎస్‌లో నమోదు చేసినవి కాకుండా, వేరే ఉత్పత్తులను, నకిలీవి విక్రయిస్తే అధికారులు చర్యలు చేపడతారు. ఫిర్యాదులు వస్తే ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల అధారంగా దాడులు చేసి లైసెన్స్ రద్దు, కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. గతేడాది నుంచే ఎరువులకు ఈ విధానం అమల్లో ఉండగా...తాజాగా విత్తనాలు, పురుగు మందులను ఈ విధానం అమలు చేస్తున్నారు.

### పారదర్శకత కోసమే..



ఓఎల్ఎంఎస్ విధానం ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాల్లో పారదర్శకతకు అవకాశం ఏర్పడింది. గతేడాది నుంచే ఎరువుల విక్రయాల్లో ఈ విధానం అమల్లోకి వచ్చింది. తాజాగా విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లోనూ ఈ విధానం అమల్లోకి తెచ్చాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

## క్లుప్తంగా

### చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వకపోవడం సరికాదు

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివ



మాట్లాడుతున్న శివ

కౌడిపల్లి(నర్సాపూర్): భూసారాన్ని పెంచే జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వకపోవడం సరికాదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌడిపల్లి అగ్రోస్ రైతు సేవా కేంద్రానికి జనుము విత్తనాల కోసం వెళ్లగా ఎకరా, అర ఎకరా భూమి ఉన్న రైతులకు ఇవ్వడం లేదన్నారు. రెండున్నర ఎకరాలకుపైగా భూమి ఉన్న రైతులకే ఇస్తున్నారని ఆరోపించారు. చిన్న రైతుల కోసం 10 కిలోలు, 20 కిలోల బస్తాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు శేఖర్, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్, లక్ష్మీపతి, వెంకటయ్య, రజాక్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఏఈఓ రాజశేఖర్‌ను వివరణ కోరగా 40 కిలోల బస్తాలు మాత్రమే ఉన్నాయని, ఇవి మూడు ఎకరాలకు సరిపోతుందన్నారు. సబ్సిడీ విత్తనాలు అయినందున ఆన్‌లైన్‌లో రైతు భూమి వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

### గొర్రెల పంపిణీలో నిర్లక్ష్యం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గొల్ల, కుర్మల సంక్షేమానికి ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం నిర్వీర్యమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ప్రతీ కుటుంబానికి ఒక్క యూనిట్ ద్వారా 21 గొర్రెలను 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగిందన్నారు. దీని వల్ల తెలంగాణ మాంసాహార ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఆవిర్భవించిందన్నారు. నేడు గొల్లకుర్మలు ఈ పథకానికి డీడీలు తీసి ఇచ్చినా ప్రభుత్వం యూనిట్ల పంపిణీని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కులవృత్తుల బలోపేతానికి కేసీఆర్ జీవం పోస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై నిరసన తప్పదని హెచ్చరించారు.

### ఎద్దుదాడిలో రైతు మృతి



రైతు ఛత్రియా మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ఎద్దు దాడిలో రైతు మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ తండాలో చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. ఖాజాపూర్ తండాకు చెందిన ధరావత్ ఛత్రియా (45) బుధవారం ఎడ్లను మేపేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఎద్దు కొమ్ములతో ఛత్రియాను తీవ్రంగా గాయపర్చగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### ముమ్మర విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): పద్నాలుగు రోజుల కిందట మృతి చెందిన వ్యక్తి పై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన పోచయ్య(60) భూమి అమ్మకం విషయంలో అడ్డొస్తున్నాడనే నెపంతో రియల్ వ్యాపారులు హత్య చేశారని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తూప్రాన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుంది. గురువారం పోలీసులు గ్రామానికి వెళ్లి పోచయ్య మృతి చెందిన నీటి కుంటతోపాటు పూడ్చిపెట్టిన స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం పూడ్చిన శవాన్ని వెలికి తీసి వైద్యులు పోస్టుమార్టం చేయనున్నట్లు పేర్కొన్నారు.



# తేమ, తాలు పేరిట దోపిడీ

- ఒక్కో బస్తాలో 3 కిలోలు అదనపు తూకం ఉంటేనే ధాన్యం దిగుమతి
- ఇదేంటని అడిగితే పట్టించుకోని నిర్వాహకులు, అధికారులు
- కుకునూరుపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లు వద్ద రైతుల ఆందోళన



ధనలక్ష్మీ రైస్ మిల్లులో నిర్వహణ ఉద్యోగితో గొడవ పడుతున్న రైతులు

కొండపాక(గజ్వేల్): ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా తేమ, తాలు పేరిట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం రైతులు ఆందోళనకు దిగారు. ఒక్కో లారీలో సుమారు 6 క్వింటాళ్ల ధాన్యాన్ని అదనంగా పంపిస్తున్నా ఇంకా ఎక్కువ కావాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ శివారులో గల ధనలక్ష్మి రైస్ మిల్లు వద్ద చోటు చేసుకుంది. బాధిత రైతులు కిష్టారెడ్డి, గడ్డం మల్లేశం, తిరుపతి, భోగి కనకయ్య, వంశీ, మహేందర్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, సింగారం గ్రామాల్లో ఐకేపీ, కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 4 గ్రామాల్లోంచి 2 లారీల ధాన్యాన్ని లోడ్ చేసి బుధవారం ముద్దాపూర్ శివారులో గల ధనలక్ష్మి రైస్ మిల్లుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పంపారు. 40 కేజీల బస్తాకు తాలు, తేమ శాతం ఎక్కువగా ఉందనే నెపంతో 42.200 కేజీల చొప్పున ఒక్కో బస్తాలో ధాన్యం నింపి పంపుతున్నారు.

**బస్తాకు కిలో కటింగ్‌కు ఒప్పుకుంటేనే..**

మిల్లుకు లారీల్లో ధాన్యం వెళ్లగానే ధాన్యంలో తాలు, తేమ శాతం ఎక్కువగా ఉందంటూ 42.200 కేజీలకు అదనంగా బస్తాకు మరో కిలో కటింగ్‌కు ఒప్పుకుంటే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటాం లేదంటే లారీ అలాగే ఉంటుందంటూ మిల్లు యజమాని చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. ఒక్కో లారీలో సుమారు 6 క్వింటాళ్ల పైబడిన ధాన్యాన్ని తేమ, తాలు పేరిట అదనంగా పంపిస్తున్నా మళ్లీ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రోజూ ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేంటని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిగితే మాకేం తెలియదు వెళ్లి మిల్లు యాజమాన్యంతో మాట్లాడుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారన్నారు. మిల్లరు చెప్పినట్లు ఒప్పుకుంటేనే ధాన్యం దిగుమతి అవుతుందని, లేదంటే రెండు, మూడు రోజులైనా లారీల్లోనే ఉంటుందని మిల్లర్ నిర్వాహకులు చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని ధనలక్ష్మి మిల్లుకు పంపించకుండా మరో మిల్లుకు పంపించాలన్నారు.

**దిగుమతి చేసుకుంటామని హామీ..**

సుమారు గంటపాటు సాగిన ఆందోళనలో రైతులకు, మిల్లులో పని చేస్తున్న కింది స్థాయి ఉద్యోగులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మిల్లు యజమాని ధర్మతేజ మిల్లు వద్దకు చేరుకోగానే రైతులు మిల్లు యజమానితో గొడవకు దిగారు. గతంలో మాదిరిగానే ధాన్యాన్ని అదనంగా కటింగ్ లేకుండా మిల్లులో దిగుమతి చేసుకుంటామంటూ రైతులకు కచ్చితమైన హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు సాబేర్, శ్రీకాంత్, స్వామి, లింగం, బ్రహ్మం, మహేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో మిల్లులోనే నిలిచిపోయిన లారీలు

# రేషన్ బియ్యం, గంజాయి పట్టివేత

**65 క్వింటాళ్లు స్వాధీనం**



కోహెడ(హుస్నాబాద్): బియ్యం నిల్వలతో పోలీసులు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో క్రమంగా నిల్వ చేసిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. గంట ఎల్లవ్వ, గంట బుచ్చమ్మ, గంట ఎల్లమ్మ వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కువ ధరకు విక్రయించేందుకు ఎన్‌టీఆర్ కాలనీలో నిల్వ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బియ్యం స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖ అధికారులకు అప్పచెప్పినట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నమన్నారు.

**దుబ్బాకలో 30 క్వింటాళ్లు**

దుబ్బాకటౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని దుబ్బాక పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గంగరాజు కథనం మేరకు.. పట్టణంలోని మల్లాయపల్లికి వెళ్లే ప్రధాన దారిలో ఓ గుడిసెలో విభూది రాజేశ్ అనే వ్యక్తి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. బొలేరో వాహనంలో తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**350 గ్రాముల గంజాయి..**

పటాన్ చెరు టౌన్: గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ కథనం మేరకు.. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర ఆదేశాల మేరకు రామచంద్రాపురం వద్ద ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. బైక్‌పై గంజాయి తరలిస్తూ ధూల్‌పేట్‌కు చెందిన బద్రీ నారాయణ సింగ్ పట్టుకున్నారు. అతడి నుంచి 350 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బుద్ధుని బోధనలు ఆచరించాలి

ప్రొఫెసర్ సుధారాణి

జహీరాబాద్ టౌన్: ప్రపంచ మానవాళికి గొప్ప జీవన విధానాన్ని అందించిన గౌతమ బుద్ధుడు చూపిన మార్గాన్ని ఆచరించాలని అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి సూచించారు. బుద్ధ జయంతి ఉత్సకమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో బుద్ధ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బూచినెల్లి బౌద్ధవిహార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచం మొత్తానికి ఆదర్శనీయమన్నారు. అంతకు ముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణం నుంచి బూచినెల్లి వద్ద గల బౌద్ధవిహార్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పంచశీల్ జెండాలను ఎగురవేసి నివాళుల రిర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ అశోక్ కుమార్, అంబేడ్కర్ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ కో ఆపరేటీవ్ సొసైటీ, ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ నాయకులు భీంవంశీ, రాంతీర్థం నర్సింలు, సుభాష్, దశరథ్, బక్కప్ప పాల్గొన్నారు.

# బృహద్ శిలాయుగం నాటి ఆనవాళ్లు లభ్యం

మద్దూరు(హుస్నాబాద్):బృహద్ శిలాయుగం నాటి ఆది మానవుల ఆవాస ప్రాంతాన్ని, ఆనవాళ్లను పురాతన పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి ధూళ్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలోని ఏకశిలా గుట్టపై గురువారం గుర్తించారు. బెక్కల్ గ్రామ శివారులో సులభంగా ఎక్కగల ఏకశిలా గుట్టతోపాటు ఆ ప్రాంతంలో సారవంతమైన మట్టితో వాగు ఉండడంతో బృహద్ శిల నాటి ఆది మానవులు ఆవాసంగా ఏర్పరుచుకున్నారు. దీంతో పాటు ఈ ప్రాంతలో పెద్ద పెద్ద రాతి నిర్మాణాలు శిలారాళ్ల వంటి ఆనవాళ్లు ఉన్నాయని అన్నారు.



పురాతన శిలలతో రత్నాకర్‌రెడ్డి

# బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన

గజ్వేల్‌రూరల్: ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన నిండు గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో అధిక రక్తస్రావం కావడంతో మరో ఆస్పత్రికి తీసుకువెళ్లగా మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని బాధిత కుటుంబీకులు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మక్తమాసాన్‌పల్లికి చెందిన భవాని(21)కి మనోహరాబాద్ మండలం రామాయపల్లికి చెందిన లక్ష్మణ్‌తో ఏడాది క్రితం వివాహమైంది. గర్భిణి భవాని ప్రతి నెలా గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుంది. ఈ క్రమంలోనే పురిటి నొప్పులు రావడంతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఆస్పత్రికి బుధవారం రాత్రి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం కాకపోవడంతో గురువారం ఉదయం శస్త్ర చికిత్స చేసి కాన్పుచేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. కొద్ది సేపటి తర్వాత భవానికి రక్తస్రావం అవుతుండడం .. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో బాధిత సభ్యులు, బంధువులు గజ్వేల్‌లోని ఆసుపత్రికి చేరుకొని భవాని మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు, ప్రజలు

# హైనా దాడిలో 65 గొర్రెలు మృతి

సిద్దిపేట జిల్లాలో ఘటన

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో 65 గొర్రెలు మృతి చెందగా.. మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. చిన్నకోడూరు మండలం మాచాపూర్‌కు చెందిన రైతు పున్నం మల్లయ్య రోజువారీగా తన గొర్రెల మందను వ్యవసాయ క్షేత్రం వద్ద పాకలో ఉంచాడు. తెల్లవారుజామున పాక వద్దకు వచ్చే సరికి 65 గొర్రెలు మృతి చెందగా, 25 గొర్రెలు తీవ్ర గాయాలతో పడి ఉన్నాయి. వెంటనే రైతు గ్రామస్తులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రేంజ్ ఆఫీసర్ ఇక్రమొద్దీన్, సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గొర్రెలపై దాడి చేసిన జంతువు కాలి గుర్తుల ఆధారంగా హైనా దాడి చేసి ఉండవచ్చని నిర్ధారించారు. అలాగే వెటర్నరీ వైద్యురాలు మంజుల సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ 25 గొర్రెలకు వైద్య చికిత్స అందించారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

# కాపు కాశారు.. కిడ్నాప్ చేశారు

మాజీ కానిస్టేబుల్ అపహరణ

- పోలీసుల గాలింపు
- సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలో ఘటన



మల్లారెడ్డి వెంకటేశం

కల్హేర్(నారాయణఖేడ్): గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం మాటు వేసి ఓ మాజీ కానిస్టేబుల్‌ను కిడ్నాప్ చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని కృష్ణాపూర్‌కు చెందిన మల్లారెడ్డి వెంకటేశం గతంలో కానిస్టేబుల్‌గా పని చేశారు. విధుల్లోంచి తొలగించడంతో గ్రామంలోనే ఉంటున్నాడు. వెంకటేశం సొంత పని మీద మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. పనులు పూర్తి చేసుకొని బయటకు వచ్చాక ముగ్గురు వ్యక్తులు వచ్చి మాట్లాడారు. మాటలతో ట్రాప్ చేసి సమీపంలోని భద్రప్ప గుడి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే మరో ఏడుగురు పిట్లం వైపు నుంచి తుఫాన్ వాహనంలో వచ్చారు. వెంకటేశంపై కారంపొడితో దాడి చేసి తుఫాన్ వాహనంలో ఎక్కించుకొని వెళ్లిపోయారు. ఘటనా స్థలంలో కత్తి, చెప్పులు, కరెంట్ వైర్లు, ఇతర వస్తువులు పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న కంగ్టీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్ఐ వెంకటేశం రంగంలోకి దిగారు. వెంకటేశం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా పిట్లం, తదితర చోట్ల సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. స్పెషల్ పార్టీ పోలీసులు రంగంలోకి దిగారు. రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలతో వెంకటేశం సోదరి, బంధువులు కలిసి కిడ్నాప్ చేయించారనే ప్రచారం జరుగుతోంది.

# పెట్రోల్ బంకులో తనిఖీ

- కొలతల్లో వ్యత్యాసం వాస్తవమే : సుధాకర్ రెడ్డి



బంక్‌లో తనిఖీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని భారత్ పెట్రోల్ బంకులో వాహనదారులకు తక్కువ పెట్రోల్ పోస్తూ మోసం చేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో గురువారం సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. లీటర్ పెట్రోల్ కొనుగోలు చేస్తే 50 ఎంఎల్ తక్కువ వస్తున్న విషయంపై జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి సుధాకర్‌రెడ్డికి వాహనదారులు ఫిర్యాదు చేశారు. బంకు తనిఖీ అనంతరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్ కొలతల్లో వ్యత్యాసం వస్తున్న విషయం వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అప్పటి వరకు బంక్‌ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న బంకుల్లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచాలని కొలతల్లో మోసాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేశారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి ..

పాపన్నపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని చెక్ డ్యాం వద్ద గురువారం చోటుచేసుకుంది. ఏఎస్సై సంగన్న కథనం మేరకు.. మేడ్చల్ జిల్లా సూరారం ప్రాంతంలోని సాయిబాబా నగర్ కాలనీకి చెందిన కావలి విజయ్ (40) బంధువుల విందు నిమిత్తం ఈ నెల 21న భార్య మాలినితో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు ఆలయ సమీపంలోని చెక్ డ్యాం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం చెక్ డ్యాం నీటిలో మృతదేహం తేలింది.

# పొలానికి నిప్పుపెట్టి.. శ్వాస ఆడక మృతిచెంది



పొలంలో రైతు మౌలానా మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): పంట పొలంలో గడ్డికి నిప్పుపెట్టడంతో వచ్చిన పొగకు శ్వాస ఆడక రైతు మృతి చెందిన ఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శేరిపల్లి గ్రామానికి చెందిన మౌలానా బుధవారం సాయంత్రం పొలం వద్ద గడ్డికి నిప్పు పెట్టాడు. మంటలు ఎగిసి పడిన సమయంలో పొగకు శ్వాస ఆడక పోవడంతో పొలంలో పడిపోయాడు. రాత్రి అయినా మౌలానా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్ద వెతికినా కనిపించలేదు. గురువారం ఉదయం మరోసారి పొలం వద్ద వెతకగా మౌలానా మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.

# దొంగతనం కేసులో ఆరు నెలలు జైలు

ఎస్సై అపూర్వ రెడ్డి

సిద్దిపేటరూరల్: దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... 2015 సంవత్సరంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో పొలం పనులు చేసుకుంటున్న అచ్చిని కవిత, చేత్రి మల్లవ్వ ల దగ్గర నుంచి నాలుగున్నర తులాల బంగారు అభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సిద్దిపేటకు చెందిన రేషన్ జ్ఞానేశ్వర్, గొడుగు శ్రవణ్, ఎర్ర నగేష్ లను పట్టుకొని వారిపై పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణలో భాగంగా గురువారం సిద్దిపేట జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి చందన వాదోపవాదాలు విన్న అనంతరం ముగ్గురు నిందితులకు 6 నెలల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికీ రూ.2వేలు జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడడంలో సమర్థవంతంగా పనిచేసిన కోర్టు కానిస్టేబుల్ పుల్ల రాజు, నాయిని ప్రదీప్ , లైజనింగ్ ఆఫీసర్ రాజమల్లు ను పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

# తోడేస్తున్నారు

- హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



ఇసుకను తీసుకొచ్చేందుకు అటవీ శాఖ ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేసిన దారి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని హల్దీ వాగు అక్రమ ఇసుక రవాణాదారులకు వరదాయినిగా మారింది. అర్ధరాత్రి అయ్యిందంటే వాగులోకి ట్రాక్టర్లను తీసుకెళ్లి ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ, పోలీస్ అధికారులకు ఇసుక రవాణాదారులు చిక్కకపోవడం వారికి కింది స్థాయి సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉన్నాయని చుట్టుపక్కల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

హల్దీ వాగులోని ఇసుకకు మంచి డిమాండ్ ఉంటుంది. మంజీరా నది ఇసుకతో పోలిస్తే చాలా రెట్లు మెరుగు. ఇసుకలో ఏ మాత్రం మట్టి పాళ్లు లేకపోవడం నిర్మాణాలకు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇదే అదునుగా భావించిన అక్రమ ఇసుక రవాణాదారులు రాత్రి అయ్యిందంటే ట్రాక్టర్లను నదిలోకి దింపి వెంట వచ్చిన వారితో అరగంటలో ట్రాక్టర్లు లోడ్ చేసి అక్కడ నుంచి కౌడిపల్లి, వెల్దుర్తి, మెదక్ మండలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు డిమాండ్ మేరకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్మకాలు చేపడుతున్నారు. జలాల్‌పూర్, కొంగోడు గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు కలిగిన వారు రింగ్‌గా ఏర్పడి ఇదంతా కొనసాగిస్తున్నట్లు పలుమార్లు వెలుగులోకి వచ్చింది. కేవలం ఇసుక రవాణాకు కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారంటే ఇసుక అక్రమ రవాణా ఏ మేరకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

**రెచ్చిపోతున్న అక్రమార్కులు..**

నదిలోకి ఇసుక కోసం వెళ్లే ట్రాక్టర్లు తిరిగొచ్చే క్రమంలో రోడ్డుకు ఇరు వైపులా అక్కడక్కడా తమ వాళ్లను పెట్టి ఎవరైనా వస్తే చెట్ల పొదల్లోకి ట్రాక్టర్లను మళ్లించి తప్పించు కోవడం చేస్తున్నారు. అయితే హల్దీ వాగులోకి వెళ్లే రహదారి అటవీ శాఖ ప్లాంటేషన్ నుంచి వెళ్లడం, అక్కడ కాల్వ తీసిన దాన్ని పూడ్చేసి దర్జాగా వాగులోకి వెళ్లడం అటవీ శాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతుందని ప్రధాన ఆరోపణ. ఒక్క రాత్రి లక్షల్లో అక్రమ ఇసుక రవాణా కొనసాగడం, ప్రభుత్వాదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతుంది.



వాగులో ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలు

**చర్యలు తీసుకుంటాం**

హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వెంటనే ఇసుక రవాణాను ఆపి వేయకుంటే క్రిమినల్ కేసులకు సైతం వెనుకాడం. ఇసుక రవాణాకు సంబంధించి సమాచారం ఇచ్చే వారి పేరును గోప్యంగా ఉంచుతాం.

– గఫూర్ మియా, తహసీల్దార్